బోనమెత్తారు..

రంగారెడ్డి జిల్లాలో ఘనంగా బోనాల ఉత్సవాలు పాల్గొన్న పలువురు ప్రముఖులు

పోతురాజుల విన్యాసం.. శివసత్తుల పూనకాలు.. డీజే హోరు, డప్పు చప్పళ్ల మధ్య యువకుల నృత్యాలు

మొయినాబాద్‌లోని సురంగల్ గ్రామంలో బోనాల సామూహిక ఊరేగింపు

చేవెళ్లరూరల్ : అంతారం గ్రామంలో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు



షాబాద్ : హైతాబాద్ దేవాలయంలో పూజలు చేసిన మాజీ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి

షాబాద్ మండలం కుమ్మరిగూడలో పోచమ్మ బోనాల ఊరేగింపు

కొత్తూరు, జూలై 29 : తెలంగాణ సంస్కృతికి బోనాలు ప్రతీకగా నిలుస్తాయని మాజీ జడ్పీటీసీ శ్రీలత అన్నారు. కొత్తూరు మండలంలోని ఎస్‌బీపల్లి, కొడిచెర్ల, ఇన్ముల్‌నర్వ గ్రామాల్లో జరిగిన బోనాల ఉత్సవాల్లో మాజీ జడ్పీటీసీ శ్రీలత పాల్గొన్నారు. ఎస్‌బీపల్లిలో జరిగిన వేడుకల్లో శ్రీలత బోనమెత్తారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దేశంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు భిన్నమైనవన్నారు. ముఖ్యంగా తెలంగాణలో నిర్వహించే బతుకమ్మ, బోనాలు మరెక్కడా కన్పించవని చెప్పారు. ఇలాంటి విభిన్న సంస్కృతే మన తెలంగాణ ప్రత్యేకతను చాటుకుంటుందన్నారు. ఆయా గ్రామాల్లో జరిగిన ఉత్సవాలో మహిళలు పెద్దఎత్తున బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సత్యనారాయణ పాల్గొన్నారు

రామన్నగూడలో..

చేవెళ్ల రూరల్, జూలై 29 : చేవెళ్ల మండల పరిధి రామన్నగూడ గ్రామంలో బోనాలు ఘనంగా నిర్వహించారు. సోమవారం మహిసమ్మ అమ్మవారికి బోనాలను సమర్పించారు. గ్రామం నుంచి కట్టమైసమ్మ ఆలయం వరకు బోనాల ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలోని ప్రజలు, యువకులు, నాయకులు ఎంతో ఉత్సాహంగా ఊరేగింపులో పాల్గొన్నారు. భక్తులు అమ్మవారికి గర్భగుడి చుట్టూ బోనం ఎత్తుకుని ప్రదక్షిణలు చేసి నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

మొయినాబాద్ కట్టమైసమ్మ ఆలయం వద్ద నృత్యాలు చేస్తున్న యువకులు, నాయకులు

షాబాద్ మండలంలో..

షాబాద్, జూలై 29 : షాబాద్ మండలంలోని కుమ్మరిగూడ, రుద్రారం, షాబాద్ తదితర గ్రామాల్లో పోచమ్మ, మైసమ్మ బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ బోనాల ఉత్సవాల్లో శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు, యువకుల కేరింతలతో గ్రామాలు మార్మోగాయి. ఈ ఏడాది వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండాలని గ్రామ దేవతలకు భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల మాజీ సర్పంచులు సుబ్రహ్మణ్యేశ్వరి, కేతన, స్వర్ణలత, మాజీ ఎంపీటీసీ అరుణ, నాయకులు, ప్రజాప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు

చేవెళ్లరూరల్ : రామన్నగూడలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్, దయాకర్ తదితరులు

చేవెళ్ల రూరల్, జూలై 29 : చేవెళ్ల మండల పరిధిలోని గ్రామాల్లో ఆషాఢమాసం బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సోమవారం అంతారం, హస్తేపూర్ తదితర గ్రామాల్లో మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పోతురాజుల విన్యాసాలు, డప్పుచప్పుళ్ల నడుమ అంగరంగ వైభవంగా బోనాల ఉత్సవాలను జరుపుకొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు సులోచన, వెంకటయ్య, స్థానిక నేతలు హరీశ్, వీరాంజనేయులు, నవీన్, ఆంజనేయులు, మణికంఠ, మహిళలు, గ్రామస్తులున్నారు.

హైతాబాద్‌లో..

షాబాద్, జూలై 29 : షాబాద్ మండలంలోని హైతాబాద్ గ్రామంలో బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో షాబాద్ మాజీ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నరసింహారెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ మల్లేశ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ యాదయ్య, మండల కో ఆప్షన్ మాజీ సభ్యుడు ఎండీ చాంద్ పాషా, మాజీ సర్పంచ్ దర్శన్, నాయకులు రాజుగౌడ్, సురేశ్‌గౌడ్, భూపాల్ రెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.

సురంగల్‌లో..

మొయినాబాద్, జూలై 29 : పోతురాజుల విన్యాసం.. శివసత్తుల పూనకాలు.. డప్పు చప్పుళ్లు.. డీజే హోరు మధ్య యువకులు నృత్యాలు చేసుకుంటూ బోనాల సామూహిక ఊరేగింపు నిర్వహించారు. మొయినాబాద్ మండలం సురంగల్ గ్రామంలో రెండు రోజులుగా బోనాల ఉత్సవాలు అంగరంగవైభవంగా నిర్వహిస్తున్నారు. సోమవారం కట్టమైసమ్మ ఆలయం వద్ద నృత్యాలు చేస్తున్న యువకులు, నాయకులు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పోతురాజుల విన్యాసాలు, డప్పు చప్పుళ్ల నడుమ ఆడుతూ పాడుతూ.. అమ్మవారికి పూజలు చేశారు.

అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలి

నందిగామ, జూలై 29 : నందిగామ మండలం బుగ్గోనిగూడ గ్రామంలో సోమవారం జరిగిన బోనాల పండుగలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి పాల్గొని అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మవార్ల ఆశీస్సులతో రైతులు, ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించేలా అమ్మవారు ఆశీర్వదించాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నీలమ్మ, ఉప సర్పంచ్ శ్రీను, పీఏసీఎస్ డైరెక్టర్ మల్లేశ్, నాయకులు శివాచారి, మల్లేశ్, రాజేశ్ పాల్గొన్నారు.

శంకర్‌పల్లి ప్రధాన రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

రోడ్డుకు మరమ్మతులు

చేవెళ్ల రూరల్, జూలై 29 : ఎడతెరిపి లేకుండా గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రధాన రహదారులు గుంతలమయమయ్యాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చేవెళ్ల ట్రాఫిక్ పోలీసులు స్పందించి సోమవారం శంకర్‌పల్లి ప్రధాన రోడ్డులో గుంతలకు మట్టి, కంకర పోయించి మరమ్మతులు చేయించారు. కార్యక్రమంలో చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం, ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, సిబ్బంది అశోక్ పాల్గొన్నారు.

విజేత టీం సభ్యులకు ట్రోఫీ అందజేస్తున్న మాజీ సర్పంచ్ అనిత

పర్వేదలో క్రికెట్ టోర్నమెంట్

చేవెళ్ల రూరల్, జూలై 29 : శంకర్‌పల్లి మండల పరిధి పర్వేద గ్రామంలో మాజీ సర్పంచ్ అనిత ఆధ్వర్యంలో పీపీఎల్-5 క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఇందులో ఐదు జట్లు పాల్గొనగా సోమవారం ఫైనల్ మ్యాచ్‌లో విన్నర్, రన్నరప్‌ల విజేతలకు ట్రోఫీలు, నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ ఎల్లయ్య, మాజీ వార్డు సభ్యుడు రవీందర్, క్రీడాకారులు శ్రామిక్, బాలు, శ్రీనివాస్ గౌడ్, రాజ్ కుమార్, జగన్‌గౌడ్ పాల్గొన్నారు.

షాద్‌నగర్‌లో ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందజేస్తున్న చింతకుంటపల్లి గ్రామస్తులు

గ్రామ భూములకు నక్ష చేయించండి

ఎమ్మెల్యే శంకర్‌కు విన్నవించిన చింతకుంటపల్లి గ్రామస్తులు

షాద్‌నగర్, జూలై 29 : కేశంపేట మండలం చింతకుంటపల్లి గ్రామ భూములకు నక్షను తయారు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్తులు సోమవారం షాద్‌నగర్‌లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతిపత్రాన్ని అందించారు. భూములకు నక్ష లేకపోవడంతో భూములను మాయం చేస్తున్నారని, రైతుల మధ్య తగాదాలను సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ రెవెన్యూ పరిధిలో సుమారు 700 ఎకరాలకు పైగా వ్యవసాయ భూమి ఉన్నదని, ఈ భూములకు రెవెన్యూ నక్ష లేక గ్రామ రైతులు, భూ వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యేకు వివరించారు. గ్రామ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యకు పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో వీరేశం, సురేశ్‌రెడ్డి, పెంటయ్య, అంజయ్య, మల్లేశ్, శంకరయ్య, యాదయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీకి భవనం ఏర్పాటు చేయాలి

ఎమ్మెల్యే కాలె యాదయ్యకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్ భారతి

చేవెళ్ల రూరల్, జూలై 29 : చేవెళ్ల మండల పరిధి నాంచేరు అనుబంధ గ్రామం ఇంద్రారెడ్డి నగర్‌లో సొంతంగా అంగన్‌వాడీ కేంద్రం భవనం లేదని, దీంతో ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్నామని, సొంత భవనం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కాలె యాదయ్యకు అంగన్‌వాడీ టీచర్ భారతి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సొంత భవనం లేక ఇబ్బందులు పడుతున్నామని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరినట్లు తెలిపారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని తెలిపారు.

నాగులపల్లి గ్రామంలో సీపీఎం జెండాను ఎగురవేస్తున్న సీపీఎం రాష్ట్ర నాయకుడు సోమయ్య

మతతత్వ రాజకీయాలకు స్వస్తి పలకాలి

షాద్‌నగర్, జూలై 29 : మతతత్వ రాజకీయాలకు స్వస్తి పలకాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు సోమయ్య ప్రజలకు పిలుపునిచ్చారు. ఫరూఖ్‌నగర్ మండలం నాగులపల్లి గ్రామంలో నిర్వహించిన సీపీఎం జిల్లా స్థాయి శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. ఆధునిక సమాజంలో ప్రజల మధ్య మతాల చిచ్చును రాజేస్తూ పలు పార్టీలు లబ్ధి పొందాలని రాజకీయాలు చేయడం బాధాకరమని అభిప్రాయపడ్డారు. ప్రజల సంక్షేమం, ప్రాంత అభివృద్ధి కోసం రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు పనిచేయాలే తప్పా మతాల పేరుతో ప్రజలను ఇబ్బందులకు, వివక్షకు గురిచేయరాదని సూచించారు. దేశంలో మతతత్వ శక్తులను తిప్పికొట్టేందుకు సీపీఎం నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని కోరారు. ఇందులో భాగంగానే శిక్షణా తరగతుల ఆవరణలో సీపీఎం జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో భాస్కర్, రాజు, శ్రీనూనాయక్, యాదయ్య, సామ్యూల్, శోభన్, కవిత, నర్సిరెడ్డి, కుర్మయ్య, వెంకటరమణ పాల్గొన్నారు.

సనాకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎర్రోళ్ల రాఘవేందర్

పేదింటి బిడ్డకు ఆర్థికసాయం

కడ్తాల్, జూలై 29 : మండల కేంద్రానికి చెందిన మహ్మద్ అహ్మద్ ఝాన్సీల కుమార్తె సనా హైదరాబాద్‌లో డిగ్రీ చదువుతున్నది. వారు పేదరికంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని ఎర్రోళ్ల రాఘవేందర్ సనా ఖర్చుల నిమిత్తం రూ.5వేలు ఆర్థికసాయం చేశారు. భవిష్యత్తులో అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

ఘనంగా శీతా పండుగ

ఆమనగల్లు, జూలై 29 : గిరిజనులు ప్రతి ఏటా నిర్వహించుకునే శీతా పండుగను మండల పరిధిలోని విఠాయిపల్లితండా, కోనాపూర్‌గేట్‌తండాలో గిరిజనులు భక్తిశ్రద్ధలతో వైభవంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా మహిళలు తండాల సమీపంలోని అమ్మవారికి పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలంటూ అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో విఠాయిపల్లి కౌన్సిలర్ సుజాత, నాయకులు, గ్రామ పెద్దలు రాములు, రాజు, బాలు, వాడ్యా, సురేశ్, రవీందర్, రవి, శ్రీను, గోపి, దశరథ్, మాల్యా, తిరుపతి, మహేశ్, హర్ష, గన్యా, రమేశ్, వెంకటేశ్ ఉన్నారు.

శీతా పండుగలో గిరిజన మహిళల నృత్యాలు

అవగాహన సదస్సులో పాల్గొన్న విద్యార్థినులు

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

షీ టీం ఏసీపీ వెంకటేశం

ఆదిబట్ల, జూలై 29 : సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని షీ టీం ఏసీపీ వెంకటేశం అన్నారు. సోమవారం ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని టాటా ఏరోస్పేస్‌లో రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఆదేశాల మేరకు ఆర్కే ఎస్సీ అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశంలో మహిళలు మరియు సైబర్ భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలను వేధించినవారికి కఠిన శిక్షలు ఉంటాయన్నారు. ఎక్కడైనా మహిళలను వేధిస్తే వెంటనే షీ టీంకు సమాచారం అందించాలని కోరారు. మహిళల భద్రతకు తెలంగాణ పోలీస్ కట్టుదిట్టమైన చర్యలు చేపట్టిందన్నారు. మహిళలకు సంబంధించిన నేరాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. సైబర్ నేరాలకు ఎక్కువ శాతం యువతీ యువకులే మోసపోతున్నారని.. సైబర్ నేరాల పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆన్‌లైన్ మోసాల పట్ల ఆయన పూర్తి సమాచారం అందించారు. కార్యక్రమంలో మహిళల ఫోరం జాయింట్ సెక్రటరీ రాధికా నాథ్, సైబర్ ఫోరం జాయింట్ సెక్రటరీ శివ కరాడి, చీఫ్ కోఆర్డినేటర్, ఆర్కేఎస్సీ సిబ్బంది సూర్య పాల్గొన్నారు.



మెహిదీపట్నం డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

బస్సు సర్వీసును పునరుద్ధరించాలి

చేవెళ్ల రూరల్, జూలై 29 : చేవెళ్ల మండల పరిధి ఆలూర్ గ్రామానికి మెహిదీపట్నం నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు గత కొన్ని రోజులుగా నిలిపివేయడంతో విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, బస్సు సర్వీసును తిరిగి పునరుద్ధరించాలని గ్రామస్తుల ఆధ్వర్యంలో డిపో మేనేజర్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. డిపో మేనేజర్‌ను కలిసినవారిలో మాజీ సర్పంచ్ విజయలక్ష్మి, రాజు, సీనియర్ నాయకులు నర్సింహులు, ప్రశాంత్ కుమార్, శంకరయ్య, రాజు, అనంతరాములు, బుచ్చయ్య, మాజీ వార్డు సభ్యుడు అహ్మద్ పాల్గొన్నారు.

మండల పరిధిలోని చల్లంపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించి నేడు బదిలీపై వెళ్తున్న రాజశేఖర్‌గౌడ్ గ్రామస్తులు సన్మానించి వీడ్కోలు పలికారు. - కడ్తాల్, జూలై 29

రంగారెడ్డి జిల్లా భారత జాతీయ మహిళా సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంటుగా వడ్ల మంజుల

చేవెళ్లటౌన్, జూలై 29 : నిరంతరం మహిళల హక్కుల కోసం పోరాటం చేస్తూ పేదల పక్షాన నిలబడే చేవెళ్ల గ్రామానికి చెందిన వడ్ల మంజుల రంగారెడ్డి జిల్లా భారత జాతీయ మహిళా సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంటుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రామస్వామి, ప్రభులింగం, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణచారి, పార్టీ మండల కార్యదర్శి సత్తిరెడ్డి, సహాయ కార్యదర్శి మక్బూల్ ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

మతతత్వ రాజకీయాలను తిప్పికొట్టాలి

సీపీఎం రాష్ట్ర నాయకుడు సోమయ్య

నందిగామ, జూలై 29 : రానున్న రోజుల్లో మతతత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉన్నదని సీపీఎం రాష్ట్ర నాయకుడు సోమయ్య అన్నారు. సోమవారం నందిగామ మండలం ఈదులపల్లి శివారులోని కాకా గెస్ట్ హౌస్‌లో సీపీఎం రంగారెడ్డి జిల్లా శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఎం రాష్ట్ర నాయకుడు సోమయ్య హాజరై సీపీఎం జిల్లా కమిటీకి పార్టీ లక్ష్యాలను వివరించారు. మతం పేరుతో రాజకీయాలు చేస్తూ కొన్ని పార్టీలు దేశ అభివృద్ధిని పక్కన పెట్టేస్తున్నాయని, మతతత్వ రాజకీయాలను రూపుమాపాల్సిన బాధ్యత సీపీఎం పార్టీ తీసుకుంటుందని, పార్టీ నాయకత్వం ఈ పోరాటానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సామ్యూల్, భాస్కర్, రాజు, జగదీశ్, యాదయ్య, కవిత, శోభన్, నర్సిరెడ్డి, అంజయ్య, శ్రీను, ఈశ్వర్ పాల్గొన్నారు.

శ్రీవాసవీనగర్ కాలనీ నూతన కార్యవర్గం ఎన్నిక

తుర్కయాంజాల్, జూలై 29 : తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి శ్రీవాసవీ నగర్ నూతన కార్యవర్గాన్ని సోమవారం కాలనీ సంక్షేమ సంఘం సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దాడి బాలకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మహేందర్‌రావు, ఉపాధ్యక్షుడిగా రాంరెడ్డి, కోశాధికారిగా వంశీ, సంయుక్త కార్యదర్శిగా బంగారయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా శివశంకర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా గోపి, లింగారెడ్డి, జంగాచారి, అంజయ్య, ప్రశాంత్, లోకేశ్‌రెడ్డి, రాజవర్ధనరెడ్డి, మల్లారెడ్డిలను ఎన్నుకున్నారు.

మాడ్గులకు 18 కోట్లు సీఎం ప్రకటించడం హర్షణీయం

మాడ్గుల, జూలై 29 : కల్వకుర్తి సభలో సీఎం రేవంత్‌రెడ్డి రూ.18 కోట్లు మండల అభివృద్ధికి మంజూరు చేస్తునట్లు ప్రకటించడం హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ మాడ్గులమండల అధ్యక్షుడు బట్టు కిషన్‌రెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

దాడికి పాల్పడినవారిపై చర్యలు తీసుకోండి

షాద్‌నగర్, జూలై 29 : ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం గ్రామానికి చెందిన చించేటి శివకుమార్‌పై దాడికి పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య అన్నారు. సోమవారం దాడికి గురైన శివకుమార్‌ను కమ్మదనం గ్రామంలో పరామర్శించి అనంతరం మాట్లాడారు. గ్రామంలో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో ఓ వర్గానికి చెందిన వ్యక్తులు శివకుమార్‌పై విచక్షణారహితంగా దాడిచేసి గాయపర్చారని, దాడికి పాల్పడినవారిని గుర్తించి శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నేటికీ గ్రామాల్లో కులవివక్ష కొనసాగడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. శివకుమార్‌ను పరామర్శించిన వారిలో పలువురు మాల మహానాడు సంఘం నాయకులు ఉన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఇబ్రహీంపట్నం : మండల పరిధిలోని రాయపోల్ గ్రామంలో 2002-2003లో పదో తరగతి పూర్తిచేసుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం ఉప్పరిగూడలోని కేఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన అప్పటి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తమ గత మధుర జ్ఞాపకాలను గుర్తుతెచ్చుకుని విద్యార్థులతో ఆనందంగా గడిపారు విద్యార్థులు తమ గురువులను ఘనంగా సన్మానించారు.

వ్యక్తి అదృశ్యం

చేవెళ్ల రూరల్, జూలై 29 : ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి కథనం ప్రకారం.. ఏపీ రాష్ట్రం, ఏలూరు జిల్లా దేవరగోపవరం గ్రామానికి చెందిన తోక వెంకట మాణిక్యారావు చేవెళ్ల మండల పరిధి దామరగిద్ద గేట్ సమీపంలోని ఓ ఫాంహౌస్‌లో పని చేస్తూ కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నారు. 25 రోజుల క్రితం తన తండ్రి అయిన నాగేశ్వర్‌రావు (50)ను తన వద్దకు తీసుకువచ్చాడు. తండ్రి ఆరోగ్యం, మానసిక స్థితి బాగా లేదని తెలిపారు. ఈ నెల 28న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లాడని, చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.